క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మునగపాక: మండలంలోని చూచుకొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఆ శాఖ ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కశింకోట మండలం నరసింగబల్లి నుంచి చూచుకొండ సబ్‌స్టేషన్ వరకు ఉన్న 33 కేవీ మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్న సందర్భంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గణపర్తి, చూచుకొండ, నరేంద్రపురం, ఆనందపురం, కుమారపురం, తదితర గ్రామాలకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

డీఎస్సీలో సీఆర్‌ఎంటీలకు వెయిటేజీ ఇవ్వాలి



డీఎస్సీలో తమకు న్యాయం చేయాలని కోరుతూ ప్లకార్డుల ప్రదర్శన చేస్తున్న సీఆర్‌ఎంటీలు

మునగపాక: రానున్న డీఎస్సీలో తమకు న్యాయం చేయాలని కోరుతూ మండల సీఆర్ ఎంటీలు గురువారం ఎంఈవో కార్యాలయం వద్ద ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. బీఈడీ అర్హత కలిగి 13 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పని చేస్తున్న తమకు వెయిటేజీ కల్పించి సాయం చేయాలని కోరారు. తమ సర్వీసును పరిగణనలోకి తీసుకొని డీఎస్సీలో వెయిటేజీ ఇచ్చేలా చూడాలని సీఆర్‌ఎంటీలు అచ్యుతకృష్ణ, లక్ష్మీనారాయణ, గోవింద, నూకేష్ తదితరులు కోరారు.

దోమల నివారణ మందు పిచికారీ



గంటవానిపాలెంలో పిచికారీ పనులు చేపడుతున్న సిబ్బంది

మునగపాక: గంటవానిపాలెం గ్రామంలో గురువారం చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేర్‌రాణి ఆధ్వర్యంలో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. సీజన్‌లో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలో భాగంగా పిచికారీ పనులు నిర్వహించారు. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు వైద్యాధికారి ఎస్తేర్‌రాణి తెలిపారు. ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సర్పంచ్ కోన వెంకటలక్ష్మి, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, ఏఎంపీహెచ్‌ఈవో గుర్రం శ్రీనివాస్, ఎంపీహెచ్‌ఎస్ జి.లక్ష్మణ్, వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక: యువత సన్మార్గంలో నడవాలని ఎస్‌ఐ పి.ప్రసాదరావు కోరారు. గురువారం రాజుపేటకు చెందిన యువకులకు ఆయన పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత మంది యువకులు విలువైన సమయాన్ని వృథా చేసుకుంటూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత పెడదారిన పడకుండా ఉద్యోగాలు లేదా వ్యాపార రంగాల్లో రాణించాలన్నారు. రాత్రుల సమయంలో బయట తిరగకుండా ఇంటికి చేరుకోవాలన్నారు. మద్యానికి బానిసలై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రవర్తించాలన్నారు.

మునగపాకలో తప్పిన ప్రమాదం



చెట్టును ఢీకొన్న లారీ

మునగపాక: మునగపాక సమీపంలో ప్రమాదం తప్పింది. గురువారం అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వైపునకు లోడుతో లారీ వెళ్తుంది. ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించే క్రమంలో పక్కనే ఉన్న చెట్టును లారీ ఢీకొంది. అయితే ఈ సమయంలో అటుగా ఎవరూ రాకపోవడంతో ప్రమాదం తప్పింది. లేకుంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు.





మునగపాక విద్యుత్ సబ్‌స్టేషన్



విద్యుత్ కోతలు.. తప్పని వెతలు

మునగపాక: అప్రకటిత విద్యుత్ కోతలతో జనం నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలకు కంటి మీద కునుకు కరువైంది. అసలే వేసవి ఉక్కపోతతో జనం అల్లాడుతుంటే ఈ కరెంట్ కోతలు మరింత భయపెడుతున్నాయి. కొద్ది రోజులుగా విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోంది. గృహ వినియోగదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈదురుగాలుల కారణంగా ఇటీవల పలు స్తంభాలు నేలకొరిగాయి. గృహాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టినా.. నేటికీ వ్యవసాయానికి విద్యుత్ సరఫరా కాకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

3 సబ్‌స్టేషన్లు.. 25,448 మంది గృహ వినియోగదారులు

మునగపాక మండలంలో మూడు సబ్‌స్టేషన్లు ఉన్నాయి. మునగపాక, వెంకటాపురం, చూచుకొండ సబ్‌స్టేషన్ల పరిధిలో 25,448 మంది గృహ వినియోగదారులు ఉన్నారు. 2,845 మంది రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మునగపాక సబ్‌స్టేషన్ పరిధిలో ఉమ్మలాడ, జేపీ అగ్రహారం, నాగులాపల్లి, ఒంపోలు, గంగాదేవిపేట, అరబుపాలెం, మునగపాక, వాడ్రాపల్లి, తిమ్మరాజుపేట, కుంచవానిపాలెం, మల్లవరం, పాత నాగవరం, కొత్త నాగవరం గ్రామాలు ఉన్నాయి. మునగపాక విద్యుత్ సబ్‌స్టేషన్ మీదుగా ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. అయితే ఆయా గ్రామాలకు ఎప్పుడు కరెంట్ వస్తుందో? ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వెంకటాపురం సబ్‌స్టేషన్‌లో ప్రతి శుక్రవారం మెయింటెనెన్స్ పేరిట ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. అంతేకాకుండా ఇతర సమయాల్లో కూడా తరచూ సరఫరాకు అంతరాయం కలుగుతోంది.

కశింకోట ఫీడరే దిక్కు.!

మునగపాక మండల ప్రజలకు అటు కశింకోట లేకుంటే ఇటు అచ్యుతాపురం మండలం కొండకర్ల ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతూ ఉంటుంది. ఇటీవల వీచిన ఈదురు గాలులకు కొండకర్ల ఫీడర్‌కు సంబంధించి స్తంభాలు విరిగిపోవడంతో కశింకోట నుంచి విద్యుత్ సరఫరా స్థానిక సబ్‌స్టేషన్‌కు వస్తుంది. అక్కడి నుంచి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తుంటారు. కొండకర్ల నుంచి ప్రస్తుతం విద్యుత్ సరఫరా అయ్యే పరిస్థితులు లేవు. కేవలం కశింకోట నుంచి వచ్చే విద్యుత్ సరఫరా మీదనే ఈ ప్రాంత వినియోగదారులు ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఈదురు గాలులు వీస్తే అంతే.!

వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో పాటు ఈదురుగాలులు వీస్తే మాత్రం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. ఐదు రోజుల క్రితం ఈదురుగాలుల కారణంగా మునగపాక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు స్తంభాలు నేలకొరిగాయి. గృహ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన అధికారులు.. వ్యవసాయ రంగానికి మాత్రం నేటికీ విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. విరిగిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.



మునగపాక మెయిన్ రోడ్డులో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

కరెంట్ ఎప్పుడు పోతుందో తెలియదు..



వెంకటాపురం సబ్‌స్టేషన్ పరిధిలో కరెంట్ ఎప్పుడు వస్తుందో? ఎప్పుడు పోతుందో తెలియదు. సరైన సమాచారం కూడా సబ్‌స్టేషన్ నుంచి వినియోగదారులకు అందదు. ప్రతి శుక్రవారం సబ్‌స్టేషన్ మరమ్మతుల పేరిత కరెంట్ ఉండదు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలి.

– మద్దాల వీరునాయుడు, ఎంపీటీసీ, సిరసపల్లి

ఐదు రోజులుగా సాగునీరు లేదు..



గత ఐదు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంట పొలాలకు సాగునీరు అందడం లేదు. స్తంభాలు విరిగిపోయిన నాటి నుంచి నేటి వరకు వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పశువులకు తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులు చర్యలు తీసుకొని కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలి.

– సూరిశెట్టి గోవింద, రైతు, మునగపాక

విద్యుత్ పునరుద్ధరణ పనిలో ఉన్నాం..

ఈదురుగాలులకు పలు విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. వాటిని సరిచేసే పనిలో ఉన్నాం. గృహ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాం. వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్ సరఫరా విషయంలో సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకుంటున్నాం. స్తంభాల ఏర్పాటు పనులు చేపడుతున్నాం. త్వరితగతిన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటాం.

– శరగడం జగదీష్, విద్యుత్ శాఖ ఏఈ

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



మునగపాకలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మునగపాక: ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ పీఎంసీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు కోరారు. గురువారం మండల కేంద్రమైన మునగపాకలో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారన్నారు. తల్లిదండ్రులు గొప్పలకు పోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరారు. హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణపై స్పెషల్ డ్రైవ్ రేపు

నక్కపల్లి: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల(ఈ–వేస్ట్) సేకరణపై శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. సాస్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించి, అక్కడ వేరు చేసి సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియతో పాటు, తాజాగా ఇళ్లల్లోను, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపయోగించే ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి వచ్చే చెత్త(ఈ–వేస్ట్) సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. దీనిపై ఒక రోజు ముందుగానే అంటే శుక్రవారమే విస్తృత ప్రచారం చేయనున్నామన్నారు.

తోటి విద్యార్థికి ఆర్థిక సాయం

నక్కపల్లి: కాళ్లు చచ్చుబడిపోయి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న తోటి స్నేహితురాలికి తమ వంతు సాయం అందించారు నక్కపల్లి డిగ్రీ కళాశాల విద్యార్థులు. నక్కపల్లి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న చింతకాయల అమ్మాజీకి ఇటీవల రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. ఈమె ఇటీవలే ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటోంది. ఆమె ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే అన్న విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు వారికి వచ్చిన ఉపకార వేతనాల్లో కొంత మొత్తాన్ని విరాళాల రూపంలో సేకరించారు. అధ్యాపకుల సాయంతో మొత్తం రూ.12 వేలను గురువారం ప్రిన్సిపాల్ శివయ్య చేతుల మీదుగా అమ్మాజీకి అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



అమ్మాజీకి సాయం అందిస్తున్న ప్రిన్సిపాల్ శివయ్య, తోటి విద్యార్థినులు

బాల్య వివాహాలతో అనర్థాలు

యలమంచిలి రూరల్: బాల్య వివాహాలపై విద్యార్థులకు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని బాలల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా సభ్యుడు డి.లోవరాజు అన్నారు. గురువారం యలమంచిలి మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెంలో జెడ్పీ హైస్కూల్‌లో 8, 9 తరగతుల విద్యార్థినులకు బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోదెపు సాయిబాబు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థి దశలోనే తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీబీ ఈ మార్తమ్మ, ఫాతిమా, జయ, నాగమణి, సింహాచలం పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యుడు లోవరాజు

ఘనంగా కనక మహాలక్ష్మి జాతర

ఎస్.రాయవరం: కర్రివానిపాలెం గ్రామంలో కనక మహాలక్ష్మి అమ్మవారి జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు అమ్మవారి ఆలయానికి వచ్చి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా పెద్ద ఎత్తున అమ్మవారి ఆలయానికి వచ్చి దర్శనాలు చేసుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఆటంకం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాత్రికి ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

యలమంచిలి వారపు సంతలో తనిఖీలు

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణంలో కనకమహాలక్ష్మి ఆలయానికి సమీపంలో వారపు సంతలో గురువారం సాయంత్రం మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వారపు సంతలో విక్రయిస్తున్న చేపలు తనిఖీ చేయగా.. కుళ్లినవి బయటపడ్డాయి. కుళ్లిన నిల్వ ఉంచిన చేపల విక్రయాలు చేస్తున్న మహిళలపై సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు. కుళ్లిన చేపలను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్న ఇద్దరు వ్యాపారులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధించారు.
పలువురు కూరగాయల వ్యాపారులు, చిరు వ్యాపారుల వద్ద ఉన్న కొన్ని ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఇకపై సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచులను ఉపయోగిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.



యలమంచిలి వారపు సంతలో తనిఖీలు చేస్తున్న మున్సిపల్, సచివాలయ సిబ్బంది

అడ్డురోడ్డు జంక్షన్‌లో వాహన తనిఖీలు

ఎస్.రాయవరం: రాత్రి వేళ 9 గంటల తరువాత విధిగా వాహనాలు తనిఖీ చేయాలని అడ్డురోడ్డు సీఐ ఎల్.రామకృష్ణ సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అడ్డురోడ్డు జంక్షన్‌లో గురువారం పలు వాహనాలు తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని అదుపులోకి తీసుకునేందుకు తనిఖీలు చేస్తున్నట్టు సీఐ చెప్పారు. ఎస్.రాయవరం ఎస్‌ఐ విభీషణరావు ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీలు సైతారుపేట, ధర్మవరం తదితర ప్రాంతాల్లో కూడా కొనసాగాయి.



అడ్డురోడ్డు కూడలిలో వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

పెయింటర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు మణికంఠ

నక్కపల్లి: మండలంలో పెయింటర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటైంది. వివిధ గ్రామాల్లో పని చేస్తున్న పెయింటర్స్ అంతా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వెంకటేశ్వర పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బండారు మణికంఠ, ఉపాధ్యక్షుడిగా గుడాల శ్రీనివాసరావు, కార్యదర్శిగా కర్రి సతీష్, కోశాధికారిగా బాడుగుల నానీలను ఎన్నుకున్నారు. సభ్యులుగా చేపల లోవరాజు, పేరిచర్ల సోమరాజు, సిరిపల్లి సింహాద్రి, మహబూబ్ సుభాన్ నియామకమయ్యారు. పెయింటర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బండారు మణికంఠ తెలిపారు.

చెరువు గట్టు రోడ్డుగా మార్పుపై ఫిర్యాదు



చెరువుగట్టు చదును చేసిన దృశ్యం

ఎస్.రాయవరం: తిమ్మాపురం శివారులో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న చెరువు గట్టును రియల్ ఎస్టేట్ వ్యాపారులు చదును చేసి రోడ్డుగా మార్చుకుంటున్నారంటూ సర్పంచ్ కర్రి సత్యనారాయణ ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో వనరులు ఒక్కొక్కటిగా నాశనం చేస్తే భవిష్యత్ తరాలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 41లో జరుగుతున్న ఈ ఆక్రమణపై తక్షణమే అధికారులు స్పందించి చదును చేసి చెరువు గట్టు మట్టిని యథావిధిగా వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

'చిప్పాడలో వైఎస్సార్‌సీపీ కేడర్ ఎక్కడికీ పోలేదు'

అచ్యుతాపురం రూరల్ : చిప్పాడ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ కేడర్ ఎక్కడికీ పోలేదని, పార్టీ బలంగానే ఉందని సర్పంచ్ రాజాన నాయుడుబాబు తెలిపారు. చిప్పాడలో వైఎస్సార్‌సీపీ ఖాళీ శీర్షికతో గురువారం ఓ దిన పత్రికలో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. బుధవారం జనసేనలో చేరిన రెడ్డి శ్రీను గతంలో టీడీపీకి చెందిన వ్యక్తి అని తెలిపారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక తన వ్యాపార లావాదేవీలకు అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో తమ పార్టీలో చేరారన్నారు.

ముగిసిన శ్రీరామరక్ష రథయాత్ర

మునగపాక: మండలంలో చేపట్టిన శ్రీరామరక్ష రథయాత్ర గురువారం ముగిసింది. ఈ నెల 13న ప్రారంభమైన రథయాత్ర మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా సాగింది. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ రథయాత్ర విజయవంతంగా ముగిసింది. పలువురు భక్తులు రాములవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆఖరి రోజున యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి దగ్గరుండీ భక్తులకు ప్రత్యేక దర్శన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విశాఖ డెయిరీ మేనేజర్ రమణ, సివిల్ ఇంజినీర్ వెలగా సురేష్ కుమార్, గణపర్తి, మెలిపాక, చూచుకొండ, మడకపాలెం, రామగిరి తదితర గ్రామాల భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



చూచుకొండలో శ్రీరామరక్ష రథాయాత్ర

మట్టి నమూనా పరీక్షలతో మేలు

మునగపాక: ప్రతి రైతు తప్పనిసరిగా తమ పంట భూముల్లో మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎం.రామారావు సూచించారు. మండలంలోని తోటాడ, వాడ్రాపల్లి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. తోటాడలో మట్టి నమూనా పరీక్షలు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అలాగే వాడ్రాపల్లిలో వరి, నువ్వు పంట సాగును పరిశీలించి, పంట చేతికి అందివచ్చే తరుణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మట్టి నమూనాల సేకరణ, ఆవశ్యకతపై రైతు సేవా కేంద్రాల నిర్వాహకులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మట్టి నమూనా పరీక్షలు చేయించుకొని వాటికి అనుగుణంగా పంటల సాగు చేపడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి, ఏఈవో ఎస్.లక్ష్మి, పద్మిని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మట్టి నమూనా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు రామారావు

విద్యార్థులకు ప్రోత్సాహం అవసరం

ఎస్.రాయవరం: విద్యార్థుల్లో ప్రతిభను బట్టి ప్రోత్సాహం అందించాలని రాజస్థాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎర్రమిల్లి జయరామ్ అన్నారు. ధర్మవరం అగ్రహారం ఉన్నత పాఠశాలలో పలువురు విద్యార్థులకు గురువారం గణితంలో ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జయరామ్ మాట్లాడుతూ ఎన్‌ఎంఎంఎస్ వెళ్లే విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్, ఫీజులు తమ ఫౌండేషన్ తరఫున అందిస్తున్నామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని, విద్యార్థులు మరింత ఉన్నత స్థాయి విద్యకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ పరీక్షల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు గారా ప్రకాష్, ఫౌండేషన్ సభ్యులు ఎం.జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు అందుకున్న విద్యార్థులతో రాజస్థాన్ ఫౌండేషన్ ప్రతినిధులు, తదితరులు

బస్టాప్, ఆర్వో ప్లాంట్ ప్రారంభం

అచ్యుతాపురం రూరల్ : ఇమిరీస్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో మామిడివాడలో నిర్మించిన బస్టాప్, పూడి ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుందరపు మాట్లాడుతూ బస్టాప్ ఏర్పాటు చేయడం వల్ల పరిశ్రమలకు వెళ్లే మహిళలు, కార్మికులు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇప్పటికే పాడైన భూగర్భ జలాల కారణంగా అనేక మంది అనారోగ్య పాలు అవుతున్న తరుణంలో పూడి ఆర్ అండ్ ఆర్ కాలనీలో తాగునీటి ఎద్దడి లేకుండా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇమిరీస్ ప్లాంట్ మేనేజర్ గోపాల రఘుకుమార్ నాలం, ఐ క్యూబ్ మేనేజర్ నాగేంద్రరావు, హెచ్ఆర్ మేనేజర్ త్రినాథరావు, టీఆర్ఈఈఐ సంస్థ తన్వీర్ ఇనామ్‌ధార్ సహకరమ, ఇమిరీస్ మేనేజ్‌మెంట్ టీం, మామిడివాడ సర్పంచ్ మట్టా అప్పలనర్స, పూడి ఆర్ అండ్ ఆర్ కాలనీ సర్పంచ్ లాలం వాణి వాసు పాల్గొన్నారు.



మామిడివాడలో బస్టాప్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్, ఇమిరీస్ పరిశ్రమ ప్రతినిధులు